తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఏరియా హాస్పిటల్‌లో... రోగులకు చికిత్సలో జాప్యం!

- డయాలసిస్ రోగులకు కనీస వసతులు కరువు - వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి - సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మేనన్, ఎమ్మెల్యే పాశం

గూడూరు, ఆగస్టు 30, ప్రభాతవార్తగూడూరు పట్టణంలో ఉన్న ఏరియా హాస్పిటల్ నందు శనివారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మేనన్ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో హాస్పిటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్పటల్ ఆవరణంలో మరుగుదొడ్లు డ్రైనేజీ సక్రమంగా లేవని త్వరలో మరమ్మతులు చేపట్టాలన్నారు. అదేవిధంగా డయాలసిస్ రోగులకు చికిత్స అందించే రూముల్లో ఏసీలు పనిచేయడం లేదని వాటిని కూడా సత్వరం మరమ్మతులు చేయాలన్నారు. అదేవిధంగా వైద్యులు వారి వారి డ్యూటీ సమయాల్లో డ్యూటీలో రోగులకు అందుబాటులో ఉండి వారి చికిత్స విషయంలో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వైద్యులు డ్యూటీలకు సక్రమ రాకుండా సొంత క్లినిక్లులు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో తీర్మానించిన హాస్పటల్ సమస్యలను తర్వాత జరిగే సమావేశంలో పూర్తి చేయాలన్నారు. ఏరియా హాస్పిటల్‌కి వచ్చే రోగుల పట్ల జాగ్రత్తలు చేపట్టాలని ఇటీవల పెన్షన్ దారులకు సర్టిఫికెట్లు విషయంలో డబ్బులు తీసుకొని పర్సెంటేజీలు వేస్తున్నారని ఇలా చేయడం వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని మరల ఇలాంటివి పురాణావతం కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో హాస్పిటల్స్ సూపరింటెండెంట్ షరీనా, డిప్యూటీ టీమ్ అండ్ హెచ్ ఓ పద్మావతి, సేలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, భారతి, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదిలోగా...
చిత్తూరుకు కృష్ణా జలాలు

- కుప్పంలో చరిత్ర సృష్టించాం.. డిసెంబర్‌లో ఎయిర్‌పోర్టు పనులు
- వైఎస్సార్సీకి రైతుల సమస్యలు పట్టవు.. ప్రతి చెరువుకు నీరందిస్తాం
- కుప్పంలో 12 ప్రాజెక్టులకు 3908కోట్ల పెట్టుబడులు.. 15వేల ఉద్యోగాలు
- కృష్ణాజలాలకు సిఎం జలహారతిలో సిఎం చంద్రబాబునాయుడు

పరమసముద్రం వద్ద బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు, సభకు హాజరైన అశేష జనవాహని

కుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త : వచ్చే ఏడాది లోగా చిత్తూరుకు కృష్ణాజలాలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. శనివారం కుప్పం మున్సిపల్ పరిధి పరమసముద్రం చెరువు వద్ద కృష్ణాజలాలకు సిఎం జలహారతి కార్యక్రమం చేపట్టారు. అనంతరం జరిగిన బహిరంగసభలో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ రోజు తన జీవితంలో పవిత్రమైన రోజు అన్నారు. ఎనిమిదిసార్లుగా తనను గెలిపిస్తున్న కుప్పానికి కృష్ణానీళ్లు తేవడంతో తన సంకల్పం నిజమైందని తన ఆనందం వర్ణనాతీతమని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా నందికొట్కూరు వద్ద ఉన్న మల్యాల దగ్గర గల శ్రీశైలం డ్యామ్‌నుంచి 738కి.మీ.ల మేర దూరం ప్రవహించి కుప్పంలో పరమసముద్రం వరకు నీరు రావడంతో కుప్పంలో చరి త్ర సృష్టించామన్నారు. 2027లో జరిగే కృష్ణా పుష్కరాలు రెండేళ్ల ముందే కుప్పంలో వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసేది ఎన్డీయే :

ఎలాంటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేసేది ఎన్డీయే ప్రభుత్వమని సిఎం చంద్రబాబుపేర్కొన్నారు. కుప్పంలో గతేడాది వైఎస్ జగన్ ఎన్నికల సమయంలో కృష్ణాజలాల సెట్టింగ్ వేశారని అది ఈ ప్రాంత ప్రజలు ఇంకా మరువలేదన్నారు. వైఎస్సార్సీ నేతలు అబద్ధాల్లో దిట్ట అని వారికి రైతుల సమస్యలు పట్టవని పేర్కొన్నారు. 2016లోనే తాను హంద్రీ-నీవా జలాలపై అసెంబ్లీలో ప్రతి నియోజకవర్గానికి నీళ్లిస్తానని ప్రకటించానన్నారు. 120టిఎంసిల నీళ్లు శ్రీశైలంకు తరలించి రాయలసీమకు ఇవ్వాలని పట్టిసీమ ప్రాజెక్టు చేపడితే అడ్డుపడ్డారని పేర్కొన్నారు. 2019లో అధికారంలో వచ్చాక కూడా వైఎస్సార్సీ ప్రభుత్వం హంద్రీ-నీవా పనులు పూర్తి చేయలేదన్నారు. ఈ ఒక్క ఏడాది కాలంలోనే ఈ ప్రాజెక్టుకు 3890కోట్లు ఖరు చ్చు చేశామని పేర్కొన్నారు. కుప్పంలో 520 చెరువులతో పాటు పాలారు చెక్‌డ్యాములను సైతం కృష్ణాజలాలతో నింపడంతో పాటు అన్ని చెరువులకు నీరందిస్తామని సిఎం స్పష్టం చేశారు. 200కోట్లతో హంద్రీ-నీవా కెబిసి లైనింగ్ పనులు చేపట్టామన్నారు. నీటి విలువ తెలిసిన పార్టీ తెలుగుదేశం అని పేర్కొన్నారు. అందుకే గతంలో నీరు -మీరు, నీరు -చెట్టు, వాటర్‌షెడ్ పనులు, నీటి సంఘాలు ఏర్పాటుచేసి జలవనరుల్ని ఒడిసి పట్టామన్నారు. ఇప్పుడు కూడా మూడు మీటర్ల లోతులో నీరు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు వరిపంటతో ఆదాయం లేదని వాణిజ్య పంటలు సాగు చేయాలని సిఎం చంద్రబాబు రైతులకు సూచించారు.

డిసెంబర్‌లో ఎయిర్‌పోర్టు పనులు :

కుప్పంలో డిసెంబర్‌నెలలో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఇక్కడ కార్గో, డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కుప్పం నియోజకవర్గంలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా 12 ప్రాజెక్టులకు సంబంధించి దాదాపు 3908కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని ప్రకటించారు. కింగ్స్ వుడ్ సంస్థ 1100కోట్లు, ఎథరన్ గిల్డ్ 500కోట్లు, హిండాల్కో 536కోట్లు, శ్రీశ్రేష్ఠ రెన్యుబల్ 40కోట్లు, రెడ్ బెర్రీ 300కోట్లు, పయనీర్ ఎఎంపిఎస్ 150కోట్లు, ఎస్‌పిఎఫ్ సోయా 373కోట్లు, ఇ-రాయిస్ సంస్థ 200కోటు , మదర్ డెయిరీ 260కోట్లు, ఏస్ ఇండస్ట్రీస్ 525కోట్లు, శ్రీజ డెయిరీ 233కోట్లు, అలీప్ సంస్థ 40కోట్ల మేర పెట్టుబడులు పెడతాయన్నారు. ఈ పరిశ్రమల ఏర్పాటుతో 15-20వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కుప్పం-హోసూరు మధ్య నూతన గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈస ందర్భంగా వివిధ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులతో సిఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో మౌఖిక ఒప్పందాలు (ఎంఒయు)లు జరిగాయి. అంతకుముందు సిఎం చంద్రబాబునాయుడు హంద్రీ-నీవా పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం కుప్పం పురపాలక సంఘం ఏర్పాటుచేసిన స్వచ్ఛరథాన్ని, ఎపి టూరిజ ం శాఖ ఏర్పాటుచేసిన కుప్పం ప్రకృతి దర్శిని బస్సును సిఎం చంద్రబాబు ప్రారంభించారు. బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ ఆస్పత్రికి సంబంధించిన సంచార స్క్రీనింగ్ వాహనాన్ని సిఎం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర విద్య,మౌలిక వసతుల కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్,టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడ సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సిఎం చంద్రబాబు

- ప్రభుత్వ పథకాల్లో లబ్ది పొందిన వారితో మాటా..మంతీ

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

కుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు శనివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. శాంతిపురం మండలం శివపురం వద్ద ఉన్న తమ స్వగృహం వద్ద నుంచి ఆర్టీసీ బస్సులో కుప్పం మున్సిపల్ పరిధి పరమసముద్రం దాకా ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించారు. బస్సులో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ది పొందిన కుటుంబాలతో మాట్లాడి వారి యోగక్షేమాలు, స్థితి గతులు అడిగి తెలుసుకున్నారు. స్త్రీ శక్తి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసు కున్నారు. మహిళలు తాము ఇబ్బంది లేకుండా ఉచితంగా వెళ్తున్నామని డబ్బులు ఆదా అవుతున్నాయని మహిళలు సిఎంకు తెలిపారు. హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు వచ్చాయని కాలువల్లో నీరు చూశారా అని సిఎం అడగ్గా కృష్ణానీళ్లు రావడం చాలాసంతోషంగా ఉందని రైతులు పేర్కొన్నారు. తల్లికివందనం పథకంలో ఆరుమందికి లబ్ది పొందిన కుటుంబం సైతం ఈ బస్సులో ప్రయాణం చేశారు.

వినాయకస్వామిని దర్శించుకున్న సిఎం:

కుప్పం పట్టణం ప్యాలస్ సర్కిల్ వద్ద వినాయక మండపంలో ఏర్పాటుచేసిన వినాయక స్వామి విగ్రహాన్ని సిఎం చంద్రబాబునాయుడు దర్శించుకున్నారు. శ్రీ మంజునాథ సేవా సంఘం అధ్వర్యంలో రావణబ్రహ్మ రూపంలో ఉన్న వినాయకస్వామి ప్రతిమను పండగ సందర్భంగా ఏర్పాటుచేశారు. ఆ మార్గంలో బస్సులో వచ్చిన సిఎం చంద్రబాబు నాయుడు అక్కడ ఆగి స్వామివారి విగ్రహాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యువనేత హర్షధర ృతేజ, యువత పాల్గొన్నారు.

ఆ దాతలకు...ఏడాదిలో 3రోజులు విఐపి బ్రేక్

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

ఆనందనిలయం అనంతస్వర్ణమయం పనులకు గతంలో విరివిగా విరాళాలిచ్చిన దాతలకు ఇప్పుడు టిటిడి సౌకర్యాలు సవరించింది. అనంతస్వర్ణమయంకు విరాళాలిచ్చిన దాతలకు ఏడాదిలో ఐదుమందికి మూడుసార్లు విఐపి బ్రేక్ జనరల్ దర్శనం కల్పించనుంది. 2008వ సంవత్సరంలో టిటిడి సంకల్పించిన ఈ పథకాన్ని కొన్ని అనివార్యకారణాల వల్ల నిలిపివేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు అర్చనానంతరం దర్శనం కల్పించాలని నిర్ణయించారు. దాతలకు అర్చనానంతరం దర్శనానికి బదులుగా ఏడాదిలో గరిష్టంగా 5మంది కుటుంబసభ్యులకు విఐపి బ్రేక్ జనరల్ దర్శనాలకు అనుమతిచ్చారు. 2,500 రూపాయలు టారిఫ్‌లో అద్దెగది సంవత్సరానికి మూడురోజులు వసతి కల్పిస్తారు. సంవత్సరానికి 20 చిన్నలడ్డూలు ప్రసాదంగా అందిస్తారు. దాతల దర్శన సమయంలో 5గ్రాముల బంగారుడాలర్, 50గ్రాముల వెండి నాణెం బహుమానంగా ఇవ్వనున్నారు. సంవత్సరానికి ఒకసారి 10మహాప్రసాదం ప్యాకెట్లు అందిస్తారు. విరాళం పాస్‌బుక్ జారీచేసిన తేదీనుండి 25సంవత్సరాలు చెల్లుబాటులో ఉంటుంది.

తిరుపతి జిల్లాలో మద్యం బార్ల ఏర్పాటుకు...

కనిపించని జోష్!

-32 బార్లకు 26 కేటాయింపు,రూ.12కోట్ల ఆదాయం

ప్రభాతవార్త-తిరుపతి:

సాధారణంగా మద్యంప్రియుల డిమాండ్‌ను బట్టి ఆయా ప్రాంతాల్లో బార్లకు భలే డిమాండ్ ఉంటుంది. మీర తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి, పుత్తూరు, సత్యవేడు, చంద్రగిరి, చిత్తూరు, పలమనేరు వంటి ప్రాంతాల్లో చాలావరకు మందుబాబులు ఏదో రిలాక్స్‌కోసం కాసేపు బాతాఖానీలా మద్యం సేవించడానికి సుముఖత చూపుతుంటారు. అలాంటి వారికోసం బార్లు ఒక కేంద్రంగా మారింది. తాజా పరిస్థితుల్లో మద్యంను ఎంఆర్‌పి ధరకే విక్రయించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మద్యం షాపుల్లోనే మద్యం ధరలు అమాంతంగా కొంత సామాన్యవర్గ మందుప్రియులకు ఊరట కలిగిస్తోంది. ఇదే ధరలు అమాంతం 10రూపాయలు అటూఇటూ ధరలతో మద్యంబార్లులో మందు లభిస్తుంది. దీంతోబాటు మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతించడంతో చాలావరకు బార్లకు వెళ్లడం తగ్గిపోతోందని మద్యం వ్యాపారులు గగ్గోలు పెట్టారు. ఇదే నేపథ్యంలో తిరుపతి జిల్లాలో మొత్తం 32 మద్యం బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా తొలి విడతలో పెద్దగా వ్యాపారులు దరఖాస్తులు వేయలేదు. ఆ తరువాత రీ నోటిఫికేషన్ ఇవ్వడంతో పెద్దగా వ్యాపారుల నుండి జోష్ కనిపించలేదు. ఇప్పుడు 32 బార్లకుగాను శనివారం సాయంత్రం 26బార్లకు దరఖాస్తులు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ ఓకే చేసి ఏర్పాటుకు అనుమతించింది. 32 బార్లకు 173మంది ఔత్సాహిక వ్యాపారులు దరఖాస్తులు చేశారు. గీత కులాలు 36తోకలపి 210. 26 బార్లు లక్కీడిప్‌ద్వారా కేటాయించారు. మిగిలిన 6 బార్లకు త్వరలో మళ్ళీ మూడోవిడత నోటిఫికేషన్ వెలువడనుంది. వీటిలో 17 వరకు బార్లు తిరుపతి నగరం పరిస రాల్లోనే ఏర్పాట ఫుతున్నాయి. శ్రీకాళహస్తిలో 2 బార్లు, చంద్రగిరి, గూడూరు, నాయుడుపేట, పుత్తూరులో ఒక్కోబారుకు అనుమతిలభించింది. గీతకులాలకు చెందిన వ్యాపారులకు తిరుపతి, శ్రీకాహస్తి, గూడూరులో ఒక్కో బారు మంజూరుచేశారు. ఈ బార్లకు అనుతిమంచడంతో ప్రభుత్వ ఖజానాకు 12,95,58,416 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చిందని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అదికారి కె.నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. కాగా నూతనంగా మద్యం బార్ల పనివేళలు కూడా పొడిగించారు. ఉదయం 10గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు బార్లను నడుపుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది,

మహిళలకు పాదాభివందనం!

పార్టీలకతీతంగా పోటెత్తిన సీ శక్తి-విజయోత్సవ సభ సక్సెస్ -ఎంఎల్‌ఏ పులివర్తి నాని

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

చంద్రగిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త: 44 వేల భారీ మెజారిటీతో నన్ను గెలిపించిన మహిళలకు పాదాభివందనం చేస్తున్నాని ఎంఎల్‌ఏ పులివర్తి నాని శిరస్సు వంచి నమస్కరించారు. చంద్రగిరి మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం నిర్వహించిన స్త్రీ శక్తి విజయోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. పార్టీలకతీతంగా మహిళలు పోటెత్తడంతో ఊహించినదానికి మించి రెండింతలకు పైగా మహిళల చంద్రగిరికి చేరుకున్నారు. పులివర్తి సుధారెడ్డి నాయకత్వంలో మహిళలు బైపాస్ నుండి పాదయాత్ర చేపట్టగా ఎంఎల్‌ఏ పులివర్తి నాని వారి వెనుక నిలిచి ప్రోత్సహించారు. కనుచూపు మేర పాదయాత్రగా మహిళలు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి మీ కుటుంబ సభ్యుడిగా వుంటానని వినమ్రతతో చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేందని విమర్శలు చేశారని గుర్తు చేశారు. రాక్షసపాలనకు చరమగీతం పాడి కూటమికి అఖండ మెజార్టీని అందించిన రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మహిళా లోకానికి పెద్దన్నగా నిలిచి ప్రతి హామీనీ అమలు చేసే దిశగా అడుగులు వేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కొనియాడారు. అధికారం చేపట్టిన వెంటనే మొదటి సంతకం పించన్ల పెంపు ఫైల్‌పై పెట్టారని గుర్తు చేశారు. ఆపై మెగా డిఎస్సీ, తల్లికి వందనం, రైతు భరోసా, ఇప్పుడు స్త్రీశక్తి పథకాలను అంచెలంచెలుగా అమలు చేసి ప్రతిపక్ష పార్టీకి దిమ్మతిరిగే సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో తాను 10 వేల మందికి ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చానని గుర్తు చేశారు. మొదటి విడత జాబ్‌మేళాలో 650 మందికి పైగా వివిధ కేటగిరీలలో ఎంపికైనట్లు తెలిపారు. అదేవిధంగా వచ్చే నెల పాకాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి రైతు కుటుంబానికి పాడి ఆవులను అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు వివరించారు. అప్పులలో వున్న రాష్ట్రాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్, నరేంద్రమోదీ నాకత్వంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా నడిపిస్తున్నట్లు తెలిపారు.

- ముచ్చటగా మూడవ సభ ఘన విజయం : పులివర్తి సుధారెడ్డి

అంతకుముందు పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ చంద్రగిరిలో మహిళలతో కలసి నిర్వహిస్తున్న మూడవ కార్యక్రమం ఇంతటి ఘన విజయం సాధించడం చాలా సంతోషంగా వుందన్నారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభ విజయోత్సవం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు సాధించిన అభివృద్ధిని వివరించారు. మరో దశాబ్ద కాలం అంటే వచ్చే రెండు సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరిలో టిడిపిని (కూటమి) బలపరిచాలని కోరారు.

-యువతకు అత్యంత ప్రాధాన్యత : తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం యువత అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాకత్వంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బహుళజాతి సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఐటి రంగాన్ని బలోపేతం చేయడంలో ముఖ్యమంత్రిని మించిన ముందుచూపు గల నాయకుడు మరొకరు లేరన్నారు.

మూషికవాహనంపై... అలరించిన పార్వతీపుత్రుడు

కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాత వార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాథుడు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన మూషికవాహనంను అధిరోహించి కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం రాత్రి స్వామివారికి మూషికవాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె , అగరంపల్లె, పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె, గ్రామాదుల విశ్వకర్మ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చక స్వాములు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామివారి మూలవిరాట్‌కు వివిధ రకాల పరిమళ సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి అలంకరించి ధూపదీపనైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అర్చకులు అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మరోమారు ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన తనకిష్టమైన మూషికవాహనంపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు నారి కేళ కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓ రవీంద్రబాబు, స్థానిక సర ప్రంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్‌లతో పాటు ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

టిక్కెట్ కౌంటర్లు అన్ని ఇక బయటే!

శరవేగంగా నిర్మాణ పనులు- 8షెడ్డుల నిర్మాణం

కౌంటర్ల ఏర్పాటు పనులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు నగదుతో పని లేకుండా అంతా ఆన్‌లైన్‌లోనే జరగాలనే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో రెండు మూడు నెలల్లో కొత్త కౌంటర్లు ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రికి ముందు రూ.70లక్షలతో పెద్ద షెడ్డును నిర్మించారు. శివరాత్రి పర్వదినాన ఈ షెడ్డు భక్తులకు ఎంతో ఉపయోగపడింది.

వివాదాలకు తెర వేయటానికి కౌంటర్లు బయటికి:

శ్రీకాళహస్తీశ్వరాలయంలోపల నేడు సేవా కౌంటర్లు ఉన్నాయి. ఇవి భక్తులకు కూడా అడ్డంకిగా మారింది. అంతేకాక కౌంటర్లను బ్యాంకర్లు నిర్వహించటం వల్ల ఎన్నో విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.కాబట్టి కౌంటర్లను కూడా దేవస్థానమే నిర్వహించాలనే దిశగా పరిశీలిస్తున్నారు. రాబోవు రోజుల్లో రంగుల,2వ గోపురం మధ్య ఏర్పాటు చేస్తున్న 8కౌంటర్లను రూ.1.62కోట్లతో మంజూరు చేసారు. రాబోవు రోజుల్లో ఆలయ ప్రాకారం మధ్య నిర్మిస్తున్నారు. ఈ మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు.శరవేగంగా పనులు చేపట్టి ఏర్పాట్లు చేస్తున్నారు. రాబోవు రోజుల్లో రాహుకేతుదోష నివారణ టిక్కెట్లు విక్రయాలకు సంబంధించి 4 షెడ్డులు, ఇతర సేవా టిక్కెట్లుకు సంబంధించి మరో 4కౌంటర్లు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు.ప్రస్తుతం దానిపక్కనే ఉన్న భక్తులు పెద తీరే మండపంను కూడా క్యూలైన్లలో కలుపుతున్నారు.

టెన్‌జీల్ షెడ్డు ఏర్పాటు:

కాగా శివరాత్రి లోపల రాజగోపురం పక్కనే ప్రస్తుతం కార్‌పార్కింగ్‌గా ఉపయోగించుకుంటున్న స్థలంలో జపాన్ టెక్నాలజీతో నిర్మించే టెన్‌జీల్ నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించారు.దీనిని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక వేదికగా ఉపయోగించనున్నారు. మిగిలిన 350రోజులు ఇక్కడ టిక్కెట్లు కొనుగోలు చేసే భక్తులు సెద తీరటానికి రాత్రి వేళల్లో సామాన్యభక్తులు కునుకు తీయటానికి సకల సదుపాయాలు కల్పించనున్నారు.ఈ మేరకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సూచనలతో అంచనాలు రూపొందిస్తున్నారు.

రూ.102కోట్లతో...అద్భుతంగా వేంకటాద్రి నిలయం

-పూర్తికావస్తున్న పనులు పరిశీలించిన టిటిడి ఛైర్మన్ నాయుడు, అదనపు ఈఓ చౌదరి

తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి: సామాన్యభక్తులకు మరింత సౌకర్యవంతంగా వసతి కల్పించేందుకు సుమారు 102కోట్ల రూపాయలతో అధునాతనంగా అద్భుతంగా నిర్మించిన వేంకటాద్రి నిలయం యాత్రికుల ఉచిత వసతి సముదాయం త్వరలో అందుబాటులోకి రానుంది. ఈ భవనంలో పూర్తిస్థాయిలో 3వేలమంది భక్తులకు అధునాతన మరుగుదొడ్లు, స్నానపుగదులు, లాకర్లు, భద్రత వంటి సదుపాయాలు ఉన్నాయి. 1,400మంది భక్తులు ఒక్కసారిగా కూర్చుని అన్నప్రసాదాలు స్వీకరించే హాలు ఉంది. శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులకు వేంకటాద్రి నిలయం యాత్రికుల ఉచిత సముదాయం అందుబాటులోకి రానుంది. ఈ భవనాన్ని శనివారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులతో కలసి పరిశీలించారు.

స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

తవణంపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అరగొండ పైమాఘం గ్రామంలో శనివారం రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డులను చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు పంపిణీ చేశారు. పైమాఘం చౌకదుకాణ పరిధిలోని కార్డుదారులకు ఆర్డీఓ చేతుల మీదుగా కార్డులు పంపిణీ చేశారు. మండల తహసిల్దారు సుధాకర్, మండల టిడిపి అధ్యక్షులు వెంకటేశులుచౌదరి, మండలనాయకులుఎ.రఘుపతి, పలువురుఅధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు సాదర వీడ్కోలు

కుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త: కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారారు. కుప్పంలో బహిరంగసభ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సాయంత్రం 5.45గంటలకు పరమసముద్రం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకు పయనమయ్యారు. సిఎం చంద్రబాబునాయుడుకు ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, స్థానిక నేతలు వీడ్కోలు పలికారు.

పి.జి.ద్వితీయ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త: కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్)లో జూలై నెలలో నిర్వహించిన ఫస్టియర్ ఎంటెక్, ఎంబిఎ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్, అనంతపురం జెఎన్‌టియు ఎగ్జామినేషన్స్ పరిశీలకులు ప్రొఫెసర్ చిత్ర శనివారం విడుదల చేశారు. ఎంటెక్ ఫలితాల్లో ఏకాంబరం,89.19శాతం, దయాసాగర్ 88.78శాతం, పఠాన్ గౌసల్ ఆజమ్86.89శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. అలాగే ఎంబిఎ సెకండ్ సెమిస్టర్‌లో సౌమ్యశ్రీ 87.13, నాగలక్ష్మి 87, హర్షిత 83.25శాతం మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమసుందరంలు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

రామకుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త: మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రామకుప్పంలో విగ్రహాలను బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగించి స్థానిక చెరువులకు తరలించారు.అన్నదాన కార్యక్రమాలు జరిపారు. యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కృష్ణాజలాలకు నేతలచే జలహారతులు

రామకుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త : మండలంలోని రాజుపేట, కిలాక్‌పోడు ప్రాంతాల్లో కూటమి నేతలు కృష్ణాజలాలకు జలహారతులు చేపట్టారు. సిఎం చంద్రబాబునాయుడు కృషితో కుప్పానికి కృష్ణాజలాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నేతలు ఆనందరెడ్డి, మునస్వామి, పట్ర నారాయణ, నరసింహులు, గుర్రప్ప, వెంకటరామగౌడు, ఆంజనేయరెడ్డి, రామూర్తి, సీతాపతి, చలపతి, చిన్నికృష్ణ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 ఉన్నత పాఠశాలకు క్రీడా పరికరాలు వితరణ

సత్యవేడు, ఆగస్టు 30 ప్రభాతవార్త: సత్యవేడు మండలంలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు హైదరాబాద్ జీటా గ్లోబల్ నిర్వహణ వీటు హెల్ప్‌యూ స్వచ్ఛంద సంస్థ క్రీడా పరికరాలను వితరణ చేశారు. శనివారం సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం పాండురంగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీటు హెల్ప్‌యూ స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాలచంద్రారెడ్డి, రాకేష్, ఎంఈవో రవితో కలసి క్రీడా పరికరాలను ఆయా పాఠశాల పీఈటీ మాస్టర్‌లకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాల చంద్రారెడ్డి మాట్లాడుతూ క్రీడా రంగంలో విద్యార్థులు వారి సత్తాను చాటాలన్న ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలను తమ స్వచ్ఛంద సంస్థ అందిస్తుందన్నారు. పాఠశాలలో క్రీడా పరికరాలు అందుబాటులో ఉండడం వల్ల విద్యార్థుల అభివృద్ధికి తగ్గట్టు వారు క్రీడా రంగాన్నిఎంచుకుని అనుకున్న లక్ష్యాలను సాధించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ మాస్టర్లు వెంకటకృష్ణయ్య, మనీ, భాస్కర్, షమీకుమార్, వెంకటేష్, డిల్లీ రాణి, రాజాది, నాగరాజు, పలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాగుతున్న అగస్తీశ్వరుని పవిత్రోత్సవాలు

నారాయణవనం, ఆగస్టు 30 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం పంచాయతీలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుని ఆలయంలో పవిత్రోత్సవాలు గత రెండు రోజులుగా ఘనంగా సాగుతున్నది. రెండవ రోజు శనివారం ఉదయం 9గ ంటలకు అగ్ర హోమం మరియు తీర్థ ప్రసాదం పంపిణీ, సాయంత్రం యాగశాల పూజ, గంధం పవిత్ర సమర్పణ, వృత్తాశ్చర్యం, లఘు పూర్ణహుతి, దీపారాధన నిర్వహించారు. అనంతరం తరలివచ్చిన భక్తులకు ప్రసాదాలను టిటిడి అధికారులు అందించారు.ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణ వేంకటేశ్వర్నునికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, ఆగస్టు 30 ప్రభాతవార్త :నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11గంటలకు స్వామి అమ్మవార్లకు ఘనంగా కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, మూర్తి, మురళి, అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన్న వుండాలి: ఎపిసి

నారాయణవనం, ఆగస్టు 30 ప్రభాతవార్త : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భోదన చెప్పాలని అసిస్టెంట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్ తెలిపారు. శనివారం మూడు క్లస్టర్లు నారాయణవనం, పాలమం గళం అరణ్యకండ్రిగ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్లస్టర్ లెవల్ మీటింగ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భోదన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒశివశంకర్, ఎంఇఓలు జనార్థన్‌రాజు, కస్తూరయ్య, సిఆర్‌సిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రక్షాళన ప్రతినిధులతో డిఆర్వో సమావేశం

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 30 ప్రభాతవార్త : ఓటర్ల జాబితాలో నమోదు, తొలగింపులో రాజకీయ ప్రతి నిధులతో జరిగిన సమావేశం భాగంగా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్ నందు గుర్తింపు పొందిన రాజకీయ ప్రక్షాళన ప్రతినిధులతో శనివారం సాయంత్రం జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు సమావేశం నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం వద్ద ఓట్లు ఉండే విధంగా చూడాలని, అవసరమైన చోట పోలింగ్ కేంద్రాలు పెంచి, అనవసరం ఉన్న చోట కేంద్రాలను తగ్గించాలని పలువురు రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు పొందిన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల ఆర్థోపెడిక్ అసోసియేషన్ వార్షికోత్సవం



తిరుపతి హెల్త్ , ఆగస్టు 30 ప్రభాతవార్త : ఆగస్టు 29 నుంచి పుదుచ్చేరిలోని మహాత్మాగాంధీ మెడికల్ కాలేజీలో దక్షిణాది రాష్ట్రాల ఆర్థోపెడిక్ అసోసియేషన్ 24వ వార్షికోత్సవ సమావేశం వైభవంగా జరిగింది. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్లు, పరిశోధకులు, యువ వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా ఆర్థోపెడిక్ రంగంలో తాజా ఆవిష్కరణలు, కొత్త చికిత్సా పద్ధతులు అధునాతన, శస్త్రచికిత్సా సాంకేతికలపై చర్చించారు. 5వేల మందికి పైగా సభ్యులున్న ఈ అసోసియేషన్ ఆహ్వానం మేరకు తిరుపతి బర్డ్ ఆస్పత్రి సంచాలకులు డాక్టర్ దూడారు జగదీష్ ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. యువ రోగులకు మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు అనే అంశంపై ఆయన విస్తృతంగా వివరించారు. ఈ సమావేశంలో ఆర్థోపెడిక్ వైద్య రంగంలో కొత్త పరిశోధనలకు, మెరుగైన చికిత్సా విధానాలకు మార్గం సుగమం చేస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

కమాండ్ కంట్రోల్ పూర్తి కాపాలు

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 30 ప్రభాతవార్త: నవంబర్ నెలలోపు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను పూర్తిస్థాయిలో అందుబాటులోనికి తీసుకురావాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ మిషన్ ద్వారా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై శనివారం మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సెప్టెంబర్ చివరిలోపు తాత్కాలిక కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తి కావాలని సంబంధిత ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ రెండవ వారంలో గోలైవ్ ప్రారంభం కావాలని, నవంబర్ నెలాఖరుకు అన్ని పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ రవి, డి.ఈ రాజు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహేశ్వరునికి మహా ధ్వజం

పుంగనూరు రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త : పట్టణం శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం పనులు శనివారం ఆలయ ఆవరణంలో ఘనంగా ప్రారంభ మయ్యాయి. అర్చకులు బాలసుబ్రహ్మణ్యం, రాములు ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తుల మధ్య మంగళ వాద్యాలు నడుమ ధ్వజస్తంభం మానుకి పూజలు నిర్వహించారు. సుమారు రూ.4 లక్షల వ్యయంతో ఇత్తడి తొడుగుతో ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నట్టు అర్చకులు తెలిపారు. ఆలయ ఈవో కమలాకర్ పర్యవేక్షణలో పనులు వేగవంతంగా కొనసాగనున్నాయని, త్వరలో భక్తుల దర్శనార్థం కొత్త ధ్వజస్తంభం ప్రతిష్ఠించబడుతుందని వారు తెలిపారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పుంగనూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో డిసిసిబి బ్యాంక్ ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి బోర్డు చైర్మన్ పగడాల రమణ అధ్యక్షత వహించారు. పుంగనూరు డిసిసిబి బ్యాంక్ చీఫ్ మేనేజర్ రాధా రాణి, బ్యాంక్ పుంగనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట్రాముడు కార్యకలాపాలను వివరించారు. రైతులకు రూరల్ హౌస్ మార్టేజీ లోన్లు రూ.3 లక్షల నుండి రూ.5 లక్షల వరకు, ట్రేడర్స్ లోన్లు రూ.50 వేల నుండి రూ.3 లక్షల వరకు 12 వడ్డీతో మంజూరు చేస్తామన్నారు. అలాగే ప్రతిరోజూ బంగారు ఆభరణాలపై అప్పులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులకు పంట రుణాలు లక్ష రూపాయల నుండి ఐదు లక్షల వరకు సహకార సంఘాల ద్వారా అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిసిసిఇ బ్యాంక్ సూపర్వైజర్ శ్రీకాంత్, సంఘ డైరెక్టర్ల శ్రీనాథ్ రెడ్డి మరియు కోలాట వెంకటరణ్యతో పాటు రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పారిశుద్ధం కాలువల నిర్వహణ ప్రధానం : చైర్మన్

పుంగనూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త: రోజురోజుకీ విస్తరిస్తున్న పుంగనూరు పట్టణంలో పారిశుద్ధం కాలువల నిర్వహణల ప్రధానంగా వర్షాకాలం అంతా దృష్టి కేంద్రీకరిస్తామని మున్సిపల్ చైర్మన్ అలీంభాష తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం ఉదయం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలు లేవనెత్తారు. ప్రధానంగా తమ తమ వీధులలో పారిశుద్ధం దిగజారిపోతోందని కాలువలు పొంగి పొర్లుతున్నాయని ఆరోపించారు. తమ ప్రాంతంలో నీటి సమస్య కూడా ప్రధానంగా ఉందని, పలువురు ఆరోపించారు. వర్షాకాలానికి ముందే ప్రధాన కాలువలలో చెత్త పూడిక తీయడం వల్ల రోడ్డుపై మురికి నీరు పారే ప్రమాదం తగ్గుతుందన్నారు. ఆమోదించబడిన ప్రధాని అజెండాలో భాగంగా పొందుపరిచిన పలు ప్రాంతాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణం కాలువల నిర్మాణం చేపడతామన్నారు.మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్‌లో ఖాతాదారులకు ఇక్కట్లు

పూతలపట్టు, ఆగస్టు 30 ప్రభాతవార్త: మండలంలోని స్టేట్ బ్యాంక్ దగ్గర మినీ బ్యాంకు తీసివేయడం వలన రైతులు వ్యాపారస్తులు ముఖ్యంగా డ్వాక్రా మహిళలు నగదును చెల్లించలేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీని వలన స్టేట్ బ్యాంకులో రద్దీ ఎక్కువ అవుతుండడంతో బ్యాంకు వస్తున్న లబ్ధిదారులకు ఆలస్యం అవడంతో పాటు అసౌకర్యంతో బాధపడుతున్నారు. అందువల్ల స్టేట్ బ్యాంక్ పూతలపట్టు వారు మినీ బ్యాంకును తిరిగి ప్రారంభంచేసిలబ్ధిదారులు కలుగుతున్న అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని తిరిగి ప్రారంభించ వలసిందిగా కోరుతున్నారు.

సత్వర సేవలు అందించడానికే స్మార్ట్ రేషన్ కార్డులు

సోమల, ఆగస్టు 30 ప్రభాతవార్త: వినియోగదారులకు సత్వర సేవలు అందించడానికి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు ప్రవేశపెట్టినట్లు తహశీల్దార్ మధుసూదన్ అన్నారు. ఆయన సోమలలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని 37 రేషన్ షాపులకు స్మార్ట్ కార్డులు అందించినట్లు ఆయన తెలిపారు. వీటివల్ల అవకతవకలు జరిగేందుకు వీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఊరమాదిగపల్లెలో పౌర హక్కుల దినోత్సవం

సోమల, ఆగస్టు 30 ప్రభాతవార్త: కందూరు పంచాయతీ ఊర మాదిగ పల్లెలో శనివారం పౌర హక్కుల దినోత్సవం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహశీల్దార్ మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు అన్ని పథకాలలోనూ భాగ స్వామ్యం చేసిందని అన్నారు. గ్రామాల్లో అంటరా నితనం రెండు గ్లాసుల పద్ధతి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ క్యూఆర్‌కోడ్ రేషన్ కార్డులు

చౌడేపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త: అర్హులందరికీ క్యూఆర్‌కోడ్ రేషన్ కార్డులందిస్తామని తేదేపా యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజు అన్నారు. మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ బాలసముద్రంలో తహశీల్దార్ పార్వతి ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేయబడ్డ స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభించారు. మండలంలో 13,059నూతన రేషన్ కార్డులు మంజూరయ్యా యనీ, ఆయా చౌకదుకాణం డీలర్లు, రెవిన్యూ అధికారులతో కలసి అందరికీ పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పూల చంద్రమౌళి, నారాయణరాజు, ఆయా చౌకదుకాణం పరిధిలోని డీలర్లు, తేదేపా నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొన్న మహిళ మృతి

చౌడేపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త: పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొన్న మహిళ మృతి చెందింది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు... మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దయల్ల కుంట్లకు చెందిన లీలావతి అలియాస్ నాగమణి(40)కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తోంది. భర్త కృష్ణప్ప మరణించడంతో అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా ఉండేదు కాదు. దీంతో శుక్రవారం గ్రామానికి సమీపంలోని పాడుపడ్డ దేవాలయంలో ఆమె తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొంది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె శనివారం మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని రుయాలోనే పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బాలసముద్రంలో పౌరహక్కుల దినోత్సవం

చౌడేపల్లి, ఆగస్టు 30 ప్రభాతవార్త: మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ బాలసముద్రంలో తహశీల్దార్ పార్వతి అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం ప్రతి 3నెలలకొకసారి మానటరింగ్ సమావేశం క్రమం తప్పకుండా నిర్వహించాలని బహుజన సేవాసమితి కృష్ణమూర్తి, బ్యాంకు రెడ్డెప్పలు తహశీల్దార్‌ను కోరారు. అదే విధంగా దళితులకు స్మశాన వాటికల కోసం స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపట్ల దురుసుగా ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. తేదేపా యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజు, కొండూరు నారాయణరాజు, విఆర్వో మల్లికార్జునరెడ్డి, రెవిన్యూ సిబ్బంది, బహుజనసేవాసమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం : ఎమ్మెల్యే

చిత్తూరుహెల్త్, ఆగస్టు 30 ప్రభాతవార్త: స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కూటమి ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇరువారం, జానకారపల్లి శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పాల్గొని లబ్దిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందించడానికి సిఎం నారా చంద్రబాబు నాయుడు రేషన్ లబ్దిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో రేషన్ పంపిణీలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని, కూటమి ప్రభుత్వంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా అర్హులైన రేషన్ లబ్దిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నిత్యవసర వస్తువులు అందేలా ఈ స్మార్ట్ రేషన్‌కార్డులు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అశోక్, తహసిల్దారు కులశేఖర్, వెంకటేష్‌యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం

– 32వ డివిజన్ టిడిపి అధ్యక్షురాలు హేమావతి

చిత్తూరురూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి వుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగు జాడల్లో నిరంతరం నడుస్తు.. చిత్తూరు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వెన్నంటి వుండి సహాయసహకారాలు అందిస్తానని 32వ డివిజన్ టిడిపి అధ్యక్షురాలు హేమావతి పేర్కొన్నారు. శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ చిత్తూరు అభివృద్ధిలో కీలక ఘట్టమైన హైరోడ్డును విస్తరిస్తూ తరతరాల సమస్యను పరిష్కరిస్తున్నారనీ, ఇందులో భాగంగా ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో ఆయన దృష్టికి తీసుకెళ్లి రోడ్డు విస్తరణ పనుల అనుమతి పొందారన్నారు.అనంతరం ఆమె సచివాలయ సిబ్బందితో కలసి స్మార్ట్ కార్డులను లబ్దిదారులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ సెక్రటరీ యోగేశ్వర్, విఆర్వో కిషోర్, వెల్ఫేర్ సెక్రటరీ రాజశేఖర్, ప్లానింగ్ సెక్రటరీ హారిక, మహిళ పోటీస్ కల్పన, చౌకదుకాన డీలర్ లతసోము, నాయకులు త్రిలోక్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు చారిత్రాత్మక నిర్ణయం:ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరపాలక పరిధిలలో ఇరువారం, జానకారపల్లి చౌక దుకాణాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను మేయర్ అముదతో కలసి లబ్దిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేసారు. గత ప్రభుత్వంలో రేషన్ పంపిణీలో అనేక అక్రమాలు జరిగాయని, కూటమి ప్రభుత్వంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నిత్యావసర వస్తువులు అందేలా స్మార్ట్ కార్డులు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ అశోక్, తహశీసిల్దారు కులశేఖర్, వెంకటేష్‌యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన షణ్ముగం

చిత్తూరురూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచనల మేరకు భాజపా 37వ డివిజన్ ఇన్‌ఛార్జీ జి.షణ్ముగం శనివారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసారు. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా నిజమైన అర్హులకు నిత్యావసర వస్తువులను అందించాలనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం స్మార్ట్ కార్డులను అమలులోకి తీసుకొచ్చింద న్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ సుబ్రమణ్యం, టిడిపి నాయకులు బాలభాస్కర్, బాలాజీ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో అధికారులపై సభ్యులు ఫైర్

వెదురుకుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం సమావేశ భవనంలో శనివారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి బండి నాగరాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధ

నగరి ఏఎంసీ చైర్మన్ రాజమ్మకు ఎమ్మెల్యే పరామర్శ

విజయపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త: విజయపురం మండలం మహారాజపురం గ్రామానికి చెందిన నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజమ్మ భర్త తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డి.సుబ్రహ్మణ్యం రాజు ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో శనివారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆ గ్రామానికి వెళ్లి వరాఇ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదానికి, అంబానికి దోచుపెడుతోంది కేంద్రం

తిరుపతి హెల్త్, ఆగష్టు 30 ప్రభాతవార్త : ప్రధాని మోదీ దక్షిణ భారత దేశ ప్రజలకు మిగిలిన సొమ్ముంతా అదానికి,అంబానికి దోచుపెడుతున్నాడని శ్రీ కాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబరు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త జంగాలపల్లి అన్నపూర్ణమ్మ తన ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేడు బ్రిటీష్‌వారు దోచుకున్నారు, నేడు తెలుగు భాష గొప్పతనాన్ని తెలుసుకోలేక త్రిభాష విధానాన్ని అవలంభిస్తూ మన దేశంలో హిందీలో పరీక్షలు పెడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఉత్తర భారదేశస్తులే ఉద్యోగాలలో నాటుకుపోయి మన పిల్లల భవిష్యత్‌ను మన నాయకులే నాశనం చేస్తున్నారని బాధపడ్డారు. అలాగే పన్నుల వాటాలో మనల్ని దోచుకుంటున్నారని బాధపడ్డారు. దీనిబట్టి ఇంత వరకు కూడా దక్షిణ భారత దేశ ప్రజలకు అన్నింట్లో అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై మన రాజకీయ నాయకులు ఆలోచించాలని ఆమె సూచించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త జంగాలపల్లి శుభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వాతికి పిహెచ్‌డి అవార్డు ప్రదానం

తిరుపతి విద్య,ఆగస్టు 30 ప్రభాతవార్త: చితానం సందేశ కావ్యానాం సాహిత్య కమధ్యయనం అనే అంశంలో సాహిత్య విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ జె.బి. చక్రవర్తి మార్గదర్శకత్వంలో స్వాతి ముత్తింటి అనే రీసెర్చ్ విద్యార్థిని పీహెచ్డీ చేసి అవార్డు పొందడం జరిగినది.ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం పరీక్షా ని యంత్రకులు డా.కె.సాంబశివమూర్తి ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది. ప్రస్తుతం స్వాతి జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ అప్పనవీడులో స్కూల్ అసిస్టెంట్ సంస్కృత అధ్యాపకురాలుగా పనిచేస్తూ ఉంది.అవార్డు పొందిన విద్యార్థినికి రీసెర్చ్ గైడ్ ప్రొ.జె.బి చక్రవర్తి,సాహిత్య విభాగం అధ్యాపకులు, విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

నిర్మాణంలో ఉన్న కట్టడంపై నుండి పడి కార్మికుడి మృతి!

రేణిగుంట ఆగస్టు 30 ప్రభాతవార్త : మండలం విపమాను పట్టెడ సమీపంలోని ఓ వెంచర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన కట్టడంపై నుండి ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కాంట్రాక్ట్ కార్మికుడు పడి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. విప్పమాను పట్టెడ పంచాయతీ నందు నిర్మాణం జరుగుతున్న ఒక ప్రైవేట్ కళాశాల బహుళ అంతస్తుల భవనంపై పనిచేస్తున్న పశ్చిమబెంగాల్ బిలాస్ పూర్ కు చెందిన అన్సార్ రహమాన్ (23) ప్రమాదవశాత్తు భవనం పై నుండి కిందపడి గాయాల పాలయ్యారు. వెంటనే అక్కడున్న కాంట్రాక్టర్లు అతనిని చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి మణి, ఏఐటీయూసీ నాయకుడు మురళి తిరుపతి మార్చురీ వద్దకు చేరుకొని కాంట్రాక్టర్ తో మాట్లాడి మృతునినీ కుటుంబానికి 5 లక్షల రూపాయల నష్టపరిహారం ఇప్పించినట్లు కార్మికులు తెలిపారు. మృతుని స్వస్థలానికి చేర్చడానికి 50వేల రూపాయలు ఇచ్చారన్నారు. కాంట్రాక్టర్ మానవత్వాన్ని చాటుకుని 5 లక్షల 50 వేల రూపాయలు మృతి చెందిన కార్మికుని కుటుంబానికి ఇవ్వడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పౌర హక్కులను కాలరాయడం క్షమించరాని నేరం

రేణిగుంట ఆగస్టు 30 ప్రభాతవార్త: భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను కాలరాయడం క్షమించరాని నేరమని రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. రేణిగుంట మండలం కొట్ర మంగళం పంచాయతీలో ఎస్సీ కాలనీ నందు పౌర హక్కుల దినోత్సవ గ్రామసభ శనివారం జరిగింది. అనంతరం తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పౌర హక్కులను భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ఇతరుల ప్రాథమిక హక్కు లను హరించడం నేరమన్నారు. ప్రతి ఒక్కరు సాటి మనిషిని గౌరవిం చాలన్నారు. రాజ్యాంగం ప్రకారం పౌరులకు భావ ప్రకటన స్వేచ్ఛ ఉందని, అయితే భావ ప్రకటన స్వేచ్ఛ ఇతరుల మనోభావాలకు దెబ్బ తగిలి విధంగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోప్రభురావు, రెవెన్యూఇన్స్పెక్టర్‌జయకృష్ణ,పంచాయితీఅధికారులు,సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు...

వినాయకుని కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలి

రేణిగుంట ఆగస్టు 30 ప్రభాతవార్త : వక్రతుండుడు, ఏకదంతుడు, తొలివేలుపు శ్రీ వినాయక స్వామి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని బాలాజీ ట్రేడర్స్ బిల్డర్స్ అధినేత కిషోర్ అన్నారు. రేణిగుంట ఒడ్డిమిట్ట గ్రామంలో గ్రామస్తులు ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద వినాయక బిల్డర్స్ ట్రేడర్స్ అధినేత కిషోర్ ఏర్పాటుచేసిన అన్న ప్రసాదాన్ని శనివారం భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అన్నసంతర్పణ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆదివారం వినాయక స్వామి విగ్రహ నిమజ్జనం జరుగుతుందని దానికి ముందు ముగ్గులు, ఉట్టి కొట్టడం తదితర సాంప్రదాయ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక స్వామి మండపం వద్ద భక్తులకు అన్నదానం

పుత్తూరు రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: పుత్తూరు మండలంలోని సిరుగురాజు పాళెం పంచాయతీ దిగువగూళూరు గ్రామంలో శనివారం రాత్రి పేదలకు అన్నదాన కార్యక్రమం దాత ఇరిగేషన్ ఏఈ జె.గురుశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డు మంచినీళ్ళగుంట వద్ద ఏర్పాటు చేసిన మండపంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సుబ్రహ్మణ్యం, జగదీష్, మంగయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో వారాహి దేవి పూజ

పుత్తూరు రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం శ్రీ సద్గురు సన్నిధిలో పాలరాతి బాబా విగ్రహంను ప్రతిష్టించిన సందర్భంగా ఆలయంలో 18వ వార్షికోత్సవం నిర్వహించారు. వారాహిదేవి పూజ, శ్యామల యాగం ఘనంగా నిర్వహించారు. అలాగే ఉదయం ఆలయంలో బాబాకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఈ వ్రతంలో సుహాసినిలు, అవివాహిత మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే రైతుకు ఆదాయం

పుత్తూరు రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: పుత్తూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వారి ఆధ్వర్యంలో రైతు సేవాకేంద్రం సిబ్బందికి డివిజనల్‌స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ పద్ధతులను అమలు ఇప్పించినట్లయితే రైతుకు ఖర్చు తగ్గడమే కాక ఆదాయం పెరగడంతో పాటు పర్యావరణానికి హితం చేకూరుతుందని తెలియజేశారు. పుత్తూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మిదేవి మాట్లాడుతూ వ్యవసాయశాఖలో అమలవుతున్న వివిధ పథకాలు పంట నమోదు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డివిజన్ వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, జిల్లా వనరుల కేంద్రం ఏఈవో రవి ప్రసాద్ పాల్గొన్నారు.

గంగజాతరకు ఆహ్వానం

పుత్తూరు రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: పుత్తూరులో సెప్టెంబరు 3వ తేదీ నిర్వహించనున్న పిడికిలి గంగమ్మజాతరకు కలుసుకోవాలంటూ జాతర కమిటీ వారు మాజీ మంత్రి రోజాను ఆహ్వానించారు. నగరి పట్టణంలోని మాజీ మంత్రి నివాసానికి వెళ్లి వారు ఆహ్వాన పత్రికను మర్యాదపూర్వకంగా ఆమెకు అందించారు. ఈ నెల 31 తేదీ చాటింపు ఉంటుందని, వచ్చే నెల 1,2 తేదీల్లో గెరిగె ఊరేగింపు, 3వ తేదీ జాతర ఉంటుందని తెలియజేశారు.

విజయబాబుకు ఆహ్వానం:

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబును కలసి గంగజాతర కమిటీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా గంగజాతరకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో గంగజాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం

పుత్తూరు రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త: గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవాన్ని పుత్తూరు శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఏజీఎం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎక్కడున్న ఎంత సాధించిన భాషను మరువకూడదని తెలిపారు. అనంతరం పిల్లలు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో జోనల్ డీన్ మోహన్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి రూపవాణి, ప్రైమరీ ఇన్‌చార్జి జ్యోతి, జోనల్ వ్యాయామ ఉపాధ్యాయుడు సతీష్, తెలుగు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం..

తిరుపతి రవాణా,ఆగస్టు 30 ప్రభాతవార్త: నగరంలోని 34 వ డివిజన్ రైల్వే కాలనీలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు గత నాలుగు రోజులుగా విశేష పూజలతో అన్నదాన కార్యక్రమాలతో భక్తులను, ప్రజలను ఆకట్టు కొంటోంది. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై వి బి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి వినాయక చవితి వేడుకల నిర్వాహకులు సింగంశెట్టి సుబ్బరామయ్య స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి భక్తులకు, ప్రజలకు అన్నదానం చేశారు. సింగంశెట్టి సుబ్బరామయ్య మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలకు పైగా వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఏటా ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు నవరాత్రులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆ వినాయక స్వామి ఆశీస్సులతో ప్రజలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అన్ని శుభాలే కలగాలని కోరుకుంటున్నట్లు సుబ్బరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు ధనుంజయులు యాదవ్, మునిశేఖర్, సురేష్, జంగం ముని సుబ్రహ్మణ్యం, నైనార్ జగదీష్, సురేంద్ర రాజు, శేఖర్, గుండాల గోపీనాథ్ రెడ్డి, తిరుత్తణి వేణుగోపాల్ పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం

తిరుపతి రవాణా,ఆగస్టు 30 ప్రభాతవార్త: ఎస్ కే ఎన్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణా నగర్ నందు వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఈరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఎస్ కే ఎన్ బాయ్స్ అసోసియేషన్ శ్రీకృష్ణ నగర్ ఎంఆర్‌పల్లి తిరుపతి ఎస్ కే ఎన్ బాయ్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ నగర్ నందు ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది.

వినాయకుని ఆశీస్సులుండాలి

తిరుపతి,ఆగస్టు30ప్రభాతవార్త: విఘ్నాలకు అధిపతి వినాయకుని ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ ఆకాంక్షించారు. నగరంలోని 24వ డివిజన్‌లో వినాయక విగ్రహం వద్ద భక్తులకు దంపూరి భాస్కర్‌యాదవ్, వట్టికుంట శంకరనారాయణ, మునిశేఖర్‌రాయల్‌తో కలసి భక్తులకు అన్నదానం చేశారు.

అందరికీ శుభాలు కలగాలి

తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని, స్వామి వారి కరుణాకటాక్షాలతో ప్రజలు సుఖసంతోషాలతో గడపాలని ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్‌గుప్త, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు.

పంటలకు భూ సార పరీక్షలు చేసుకోవాలి : ఏడీ

సత్యవేడు, ఆగస్టు 30 ప్రభాతవార్త: పంటలకు ఎరువులు వాడే ముందు రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు నిర్వహించుకునేలా చూడాలని సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీ సుబ్రహ్మణ్యం కోరారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో తిరుపతి డీఆర్సీ ఆధ్వర్యంలో ఖరీఫ్ పంట సాగు, ఏపీఏ ఐఎంఎస్ యాప్‌పై వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పంట సాగులో ఎరువులను సరైన మోతాదులో ఉపయోగించాలన్నారు. తద్వారా నేల సారం పెరగడంతో పాటు ఖర్చులు తగ్గి పంట దిగుబడులు అధికమవుతుందన్నారు. నేలసారం, పంట రకం, నేర రకం ఆధారంగా ఎరువుల మోతాదును నిర్ణయించాలన్నారు. ఎరువులను నేలలో కలిసేలా వేయడం, నీటి పారుదల వ్యవస్థకు అనుగుణంగా ఎరువులు ఇవ్వడం ముఖ్యమని తిరుపతి వ్యవసాయ శాఖ ఏవో గోల శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవోలు మురళి,గౌరి, సంజీవరెడ్డి,చిట్టిబాబు, సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల సచివాలయ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజేరమ్మ తల్లిని దర్శించుకున్న సత్యవేడు ఎమ్మెల్యే

నారాయణవనం, ఆగస్టు 30 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా నగరి నియోజకవర్గం వడమాలపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఆంజేరమ్మ తల్లిని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్‌లు శనివారం ఉదయం దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి టెంకాయహారతులు పట్టారు. అనంతరం అర్చకురాలు అర్చన చేసిన తర్వాత అమ్మవారి ప్రసాదాన్ని అందించారు.

తిరుపతి డివిజన్

తాగు నీటి సమస్యకు పరిష్కారం

పాలసముద్రం,ఆగస్టు 30 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలోని కృష్ణ జిమ్మాపురం పంచాయతీ ఇందిరా నగర్ లో గత సంవత్సరం రోజులుగా తాగునీటి కోసం కష్టాలు పడ్డారు. అనేకసార్లు అధికారులకు వినతి పత్రం అందించిన ప్రయోజనం లేకపోవడంతో. చివరి ప్రయత్నం గా స్థానిక జడ్పిటిసి ని అడగగా అతను స్పందించి గతంలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో దీనిపై చర్చించి వారు వెంటనే స్పందించి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారు. జిల్లా పరిషత్ నిధులతో గత వారం బోరువేగా నీళ్లు రావడంతో శనివారం మోటార్ అమర్చి నీటిని వదిలారు. త్రాగునీటి కోసం ఇన్ని రోజులు కష్టాలు పడిన ప్రజలు ఒక్కసారిగా నీటి సమస్య తీరడంతో వారి కళ్ళల్లో ఆనందం కనిపించింది.

గుంతల రోడ్లతో...ప్రజల కష్టాలు

పాలసముద్రం,ఆగస్టు 30 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలోని ఆముదాల హరిజనవాడికి వెళ్లే దారి పూర్తిగా గుంతల మయంగా మారింది. ఆముదాల గ్రామం నుంచి ఆముదాల హరిజనవాడకు వెళ్లే దారిలో నీటిమడుగుల గుంతలు ఉన్నాయి ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గుంతలు పూర్తిగా నీటితో నిండి ఉండడంతో ఏ గుంత ఎంత లోతు ఉందని తెలియక చాలామంది రాత్రిలో వెళ్లే పాదాచారులు నీటి గుంతలలో పడుతున్నారు. గుంతలు ఎక్కువ లోతు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు కూడా ప్రమాదాల కు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజల సౌకర్యార్థం రోడ్డుకు మరమ్మతు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

వరసిద్ధుని సేవలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్

కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాతవార్త: రాష్ట్ర సమాచార మక్కు చట్టం కమీషనర్ చావలి సునీల్ శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారు వేదమంపడ పంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి 25 లక్షల భారీ విరాళం

కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం 25 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు.ఈమేరకు విజయవాడకు చెందిన గుమ్మడి అన్వేష్ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 25 లక్షల రూపాయలను విరాళంగా అందజే శారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఈఓ పెంచల కిషోర్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, వేదపండితుల ఆశీర్వచనం చేసి శేషవస్త్రాలను, ప్రసాదాలను చిత్రపటాన్ని అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలదయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో బస్సు కిందపడి మహిళ దుర్మరణం

తవణంపల్లె, ఆగస్టు 30 ప్రభాతవార్త: మండల కేంద్రం తవణంపల్లెలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం పాలైంది. వివరాలి లావున్నాయి. గంగవరం మండలం కీలపట్లకు చెందిన నారాయణమ్మ(60) అనే మహిళ తమ మనుమడు కలసి ద్విచక్రవాహనంలో కాణిపాకం ఆలయ దర్శనార్థం బయటు దేరింది. వీరు తవణంపల్లెలో వెళుతుండగా రోడ్డుపై వున్న గుంత వద్ద ద్విచక్రవాహం అదుపు తప్పి పడిపోయింది. దీనితో వీరిరువురు వాహనంపై నుండి కిందపడ్డారు. అదే సమయంలో చిత్తూరు నుండి మాధవరం వెళుతున్న ఆర్టీసీ బస్సు నారాయణమ్మ తలపై ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లేటిక్ పోటీలకు చైతన్య విద్యార్థులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త : రాష్ట్ర స్థాయి అథ్లేటిక్ పోటీలకు శ్రీకాళహస్తిలోని శ్రీ చైతన్య విద్యార్థులు ఎంపికయ్యారు. షాట్‌పుట్ పోటీలలో 16సంవత్సరాల లోపు బాలుర విభాగంలో జెషిత్ హర్ష(9వతరగతి) మొదటి స్థానాన్ని సాధించి బంగారుప తకాన్ని అందుకున్నారు. 14సంవత్సరాల లోపు బాలికల విభాగంలో 8వ తరగతి చదువుతున్న యశస్వి రెండవ స్థానం సాధించి రజిత పతకాన్ని అందుకున్నారు. మూడవ స్థానంను 7వ తరగతి చదువుతున్న ధృవీ సాధించి కాంస్య పతకాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ,కృషి, పట్టుదల,క్రమశిక్షణతోనే విజాయాలు సాధిస్తున్నారని అభినందించారు.ఎం.సురేష్, బాలాజి, మేఘన, త్రివేణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

బీడి కార్మికులకు రెక్కల పురుగుల బెడద

తొట్టంబేడు, ఆగస్టు 30 ప్రభాతవార్త : మండలంలోని తెలుగుగంగ ఒడ్డున ఉన్న బీడి కార్మికుల కాలనీ సమస్యల వలయంగా మారింది. ఇక్కడ ప్రభుత్వం సివిల్ సప్లైస్ గోదామును నిర్మించారు. ఈ గోదాము నుంచి 'రెక్కల పురుగులు' కాలనీని చుట్టుముడుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. భోజనం చేస్తున్నా,టీ తాగుతున్న పురుగులు వచ్చి పడుతూ ఇబ్బంది కల్గిస్తున్నాయని వివరించారు. కోందరికి కన్నుల్లో పడుతున్నాయని వివరించారు. సాధారణంగా గోదాము నిర్వాహకులు పురుగులు చుట్టుపక్కల ఇబ్బంది కల్గించకుండా స్ప్రేచేసే వారని కానీ ప్రస్తుతం ఎందుకో పట్టించుకోవటం లేదని వివరించారు.కాబట్టి గోదాము నిర్వాహకులు రెక్కల పురుగుల నియంత్రణకు స్ప్రే చేయించి కాలనీ వాసుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

శివయ్య సేవలో హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త : రాష్ట్ర హైకోర్టు జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ కుటుంబసమేతంగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి ఎపిఆర్ఓ రవిలు వేదపండితులచే స్వాగతం పలికారు.ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్థానిక న్యాయస్థానం జడ్జిలు శ్రీనివాస్ నాయక్, జేబీరాణి కోర్టు పర్యవేక్షకులు రవిలు పర్యవేక్షించారు. ఏర్పాట్లను ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి,సుదర్శన్ న్యాయులు పర్యవేక్షించారు.

ఎన్‌టిఆర్ నగర్‌లో అన్నదానం

శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్‌లో వెలసిన విజయగణపతి ఆలయంలో శనివారం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఉదయం నుంచి ఆలయం వద్ద నిరుపేదలకు అన్నదానం జరిపారు. భరత నాట్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది.రమణ,ఆకుల గురుమూర్తి, మధు, రమేష్, మురుగయ్య, మురళి, సుధాకర్,వంశీ,మునస్వామి,మిధున్,ధనూష్, గుర్రు,మోహన్‌కృష్ణ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ఉట్టి ఉత్సవం

శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలో వినాయక చవితి సంబరాలు మిన్న

గణం.. కదిలి గంగమ్మ ఒడికి చేరి!

కోట,ఆగస్టు 30 ప్రభాతవార్త: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కొలువుదీర్చిన గణనాధులను నాలుగురోజైన శనివారం పలు చోట్ల భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తొలుత గణనాధుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు చేపట్టారు. పెద్ద ఎత్తున బాణా సంచా కాలుస్తూ రంగులు చల్లుకంటూ, నృత్యాలు చేస్తూ సముద్రం ఒడ్డు చేర్చారు. ఆయా కార్యక్రమాల్లో యువత, చిన్నారులు, మహిలలు పెద్ద సంక్యలో పాల్గొని సందడి చేశారు. వాకాడు సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు వరకు 497 విగ్రహాలను తూపిలిపాళెం సముద్రంలో నిమజ్జనం జరిగినట్ల సిఐ హెస్సెన్ భాష ప్రభాతవార్తకు తెలిపారు. శ్రీనివాససత్రం సముద్రం వద్ద కోట ఎస్ఐ పవన్ కుమార్ ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకొకుండా బందో బస్తో ఏర్పాటు చేసి పర్యేవేక్షిస్తున్నారు.మండలంలోని గణపతి మహోత్సవాలు సందర్భంగా వినాయకుని విగ్రహాలకు భక్తులు భక్తి శ్రద్ధలు విశేషపూజలు జరిపారు. మండల పరిధిలోని చెందోడులో వడ్డిపాళెంలో యువత శుక్రవారం రాత్రి కబాడీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు టీమ్‌ల మధ్య కాబాడీ హోరీ హోరీగా కొనసాగింది.

అర్హులైన దివ్యాంగులందరికి పింఛన్లు

కోట,ఆగస్టు 30 ప్రభాతవార్త: జిల్లాలో దివ్యాంగులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు యధాతధంగా అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి పింఛను నిలుపుదల,మార్పు చేస్తూ ఇచ్చిన నోటీసులను ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అధికారులు ఉపసంహరించుకున్నారు. వీరందరికి సెప్టెంబర్ నుంచి పింఛన్లు పంపిణీ చేయున్నుట్లు ఎంపిడివో వేణు తెలిపారు. కోట మండలంలో 56 మందికి నోటీసులు ఇచ్చారు, 60 ఏళ్ల వయస్సున్న వారికి వృద్ధాప్య పింఛను 40 శాతం పైన అర్హత ఉన్న వారికి కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సచివాలయా సంక్షేమ అధికారులు శనివారం బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసి సెప్టెంబర్ ఒకటో తేదీన పంపిణీ చేప్తారని కోట ఎంపిడివో వేణు తెలిపారు.

మన డబ్బులకు మనవే లెక్కలు

అక్రమాల అడ్డుకట్టకు అందుబాటులోకి యాప్

కోట,ఆగస్టు 30 ప్రభాతవార్త :రుణాలకు సంబంధించి బకాయిలను పొదుపు సంఘాల మహిళలు చెల్లించినా కొన్ని చోట్ల బ్యాంకులకు జమ కావడం లేదు. కొంత మంది సభ్యులు ఆమొత్తాలను దారి మళ్లించి సొంతానికి వినియోగించు కుంటున్నారు. ఈ తరహా ఉదంతాలు జిల్లాలో తరచూ వెలగుచూస్తున్నాయి. సభ్యుల మధ్య గోడవలూ అవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పోలీసు కేసులు కూడా నమోదువుతున్నాయి. ఈ నేపద్యంలో పొదుపు సంఘాల మహిళల కోసం ప్రభుత్వం మన డబ్బులు మన లెక్కలు అనే యాప్‌ను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. నగదు మళ్లింపు అక్రమాలకు తావు లేకుండా కొత్త యాప్‌తో అడ్డకట్ట పడనుందిని వెలుగు అధికారులు చెబుతున్నారు.

కోటలో పౌరహక్కుల దినోత్సవం

కోట,ఆగస్టు 30 ప్రభాతవార్త: భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోట మడల తహిసీల్దార్ కె.జయజయరావు కోరారు. శనివారం కోటలోని ఎస్‌సి బాలికల వసతి గృహంలో పౌరహక్కుల దినోత్సవంను తహశీల్దార్ కె.జయజయరావు అధ్వర్వంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ పధకాల అమలు పై విద్యార్దులకు వివరించారు. ఎవరైతే క్రమశిక్షతో చదువుతారో అటువంటి విద్యార్దులకు మంచి భవిష్యత్ ఉంటుదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేట్రన్ ఉషరాణి, వ్యవసాయాధికారి సుచ్చేంద్ర ప్రసాద్, సిడిపిఒ మునికుమారి, డాక్టర్, నాగరాజు, డిప్యూటి తహసిల్దార్, మల్లిఖార్జున్‌రావు,తదితరులు ఉన్నారు.

ఘనంగా ముగిసిన శ్రీ గణేష్ ఉత్సవాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 30 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీనగర్ కాలనీలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడురోజుల పాటు నిర్వహించిన శ్రీ గణేష్ ఉత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీగణేష్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలంపాట నిర్వహిం చారు. ఈ లడ్డూను శ్రీగణేష్ రెడీమిక్స్ అధినేత పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కవిత దంపతులు రూ.57 వేలకు వేలంపాటలో పాడుకున్నారు. గ్రామోత్సవం అనంతరం కాళంగి నదిలో శ్రీ గణేషుని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌నాయుడు, దువ్వూరు శేఖర్‌రెడ్డి, ఎంవి రమణయ్య, ఎం.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

సూళ్లూరుపేట, ఆగస్టు 30 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న పద్మను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ కార్మికులు డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలు రెండోరోజైన శనివారం కొనసాగించారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కండక్టర్ పద్మ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సస్పెండ్ అయిన పద్మతో పాటు మహిళా కండక్టర్లు పుష్పలత, గౌరి, కుసుమ, జాలమ్మ, సుధాకర్, శ్రీనివాసులు, కల్యాణ్ కృష్ణ, అశోక్, శంకరయ్య, హరీష్, రామచంద్రయ్యలు పాల్గొన్నారు.

తెలుగు భాషను మరువరాదు

వెంకటగిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త: తెలుగు భాషను మరో రాదని వక్తలు అన్నారు. ఆర్.వి.యం ఉన్నత పాఠశాల యందు మనబడి మన మిత్రులు పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహణలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించి విద్యార్థులకు వేమన, సుమతి, తెలుగు బిడ్డ, తెలుగు బాల, భర్తృహరి పద్యాలతో కూడిన తెలుగు శతక పద్యాల పుస్తకాలను పునుగు విమలా వారి తల్లి తండ్రులైన దర్భా శివరామకృష్ణ,హైమావతి దంపతుల జ్ఞాపకార్థం ముద్రించి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర శ్రీలత, ఉపాధ్యాయులు కృష్ణ మోహన్, బాబి, వల్లభ దాసు, మరియు మిత్ర మండలి సభ్యులుఢిల్లీ బాబు, నర్రారవి, సుంకర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల కులస్తులకు బిసి డిఎన్టి సర్టిఫికెట్లు ఇవ్వాలి

వెంకటగిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త: సంచార జాతుల కులస్తులకు బిసి డిఎన్టి సర్టిఫికేట్ ఇవ్వాలని అఖిలభారత సంచార జాతుల కులం సంగం కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు కోరారు. విజయవాడ పట్టణంలోని వేన్యూ కళ్యాణ మండపం నందు సంచారజాతుల విముక్తి దినోత్సవ కార్యక్రమంను రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, ఆదోని నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పార్థసారధి,అనేకమంది బిజెపి నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి సంచార కులాలకు చెందిన సంఘ నాయకులు మరియు వివిధ కులాలకు చెందిన కళాకారులు పాల్గొని కుల సాంప్రదాయ కలలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంనకు అఖిలభారత సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు పాల్గొని కేంద్ర సామాజిక న్యాయశాఖ ఆదేశాలకు అనుసరించి మాకు బీసీ డిఎన్టి సర్టిఫికెట్ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జాప్యం జరుగుతుందని మరియు పలు సమస్యలు శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు గారికి మరియు సభ్యులు డాక్టర్ పార్థసారధి గారికి తెలియజేసి వినతి పత్రములు అందజేసినాము. వివిధ కులాలకు చెందిన నాయకులు సత్యనారాయణ, వరప్రసాద్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వాకాడు తహశీల్దారుగా... సయ్యద్ బాధ్యతలు

వాకాడు, ఆగస్టు 30 ప్రభాతవార్త: వాకాడు నూతన తహశీల్దారుగా సయ్యద్ ఇక్బాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి, రెవెన్యూ పరంగా పనులు జరిగేలా చూస్తాం అన్నారు. వరికుంటపాడు, కందుకూరు, తడ మండలాలో తహశీల్దారుగా పనిచేశానన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

వైకాపా మండల కన్వీనర్‌గా సుధాకర్ నాయుడు

వాకాడు, ఆగస్టు 30 ప్రభాతవార్త: వైకాపా మండల కన్వీనర్‌గా ఏనుగు సుధాకర్ నాయుడును వైయస్సార్సీపి అధిష్టానం నియమించింది. శనివారం నూతనంగా వైకాపా మండల కన్వీనర్‌గా ఎన్నికైన సుధాకర్ నాయుడు మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు వాకాడు మండల వైఎస్ఆర్సిపి కార్యవర్గంను నియమించిందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సుధాకర్ నాయుడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని వైకాపా బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

గూడూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త : రెండో పట్టణంలోని నాయి బ్రాహ్మణ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలిక తప్పి పోవడంతో కుటుంబ సభ్యులు గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనితో గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి బాలిక ఆచూకీని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలికకు ఆరోగ్యం బాగాలేదని, ఇంట్లో వాళ్ళు మందలించడంతో బాలిక ఇంట్లో నుంచి వెళ్లి పోయిందని తెలిపారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

మధుమోహన్ దాస్ ఘనంగా వీడ్కోలు

పెళ్లకూరు ఆగస్టు 30 ప్రభాతవార్త: పెళ్లకూరులోని మండల కార్యాలయం నందు పంచాయతీ సెక్రెటరీగా పనిచేసిన చికోలు మధుమోహన్ దాస్ కు ఘనంగా పదవి విరమణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తనతో పని చేసిన సహ ఉద్యోగులతో పాటు మండల ఉన్నత అధికారులు బంధువులు స్నేహితులు అందరూ కలిసి ఆనందంగా పూలమాలలు శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మధుమోహన్ దాసు గత 20 సంవత్సరాలుగా పెళ్లకూరు మండలంలో పంచాయతీ సెక్రటరీగా అవిశ్రాంతంగా పనిచేశాడని అందరితో కలుపుకోలుగా ఉంటూ వివాదరహితుడుగా పేరు తెచ్చుకున్నాడు అన్నారు.

గూడూరు డివిజన్

గిరిజన కాలనీలో సివిల్ రైట్స్‌పై అవగాహన

గూడూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త: పురపాలక సంఘం పరిధిలోని నెలటూరు గిరిజన కాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు ఏసుపాకు పెంచలయ్య, గూడూరు డివిజన్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు మాకాని వెంకటేశ్వర్లు హాజరైనారు. ఈ కార్యక్రమానికి గిరిజనులు ఎక్కువమంది హాజరైనారు. వారిని ఉద్దేశించి అట్రాసిటీ పెంచలయ్య మాట్లాడుతూ నెలటూరు చౌట గిరిజన కాలనీలో మౌలిక సౌకర్యాల గురించి, పిల్లల చదువులు గురించి, మానవ హక్కుల గురించి, పోలీసు చట్టాల గురించి, ఎస్సీ ఎస్టీ కేసుల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి మండల డిప్యూటీ తహసిల్దార్ చైతన్య, ఆర్ ఐ రమాదేవి, మెడికల్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ ఉమా, ఐసిడిఎస్ ప్రాజెక్టు వారు, ఈ కార్యక్రమానికి అన్ని డిపార్ట్మెంట్లు రావాల్సి ఉండగా, కొన్ని డిపార్ట్మెంట్లు పాల్గొన్నారు.

డిఎల్‌డివో పనులను పరిశీలించిన జడ్పీ చైర్మన్

గూడూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త: పట్టణంలోని డిఎల్‌డివో కార్యాలయ ఏర్పాటు పనులను జిల్లా ప్రజా పరిషత్ జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆక్టోబరు నెలలో రాష్ట్రంలోని అన్ని డిఎల్‌డివో కార్యాలయాలు ప్రారంభోత్సవాలు చేపట్టి కార్యాలయాలు అందుబాటులోకి తీసుకొనిరావలని సూచించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని 5డివిజన్‌లలో డి.ఎల్.డి.ఓకార్యాలయాల ఏర్పాటు చేయుటకు ఒక్కొక డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు, మరమ్మతులకు సుమారు ఆరు లక్షలు, కార్యాలయపు ఫర్నిచర్ కొరకు రెండు లక్షలు, కంప్యూటర్లు ఇతర పరికరముల కొరకు రూ. 2.00లక్షలు, ఒక్కొక డివిజన్ కార్యాల యానికి సుమారుగా పది లక్షల వంతున జిల్లా ప్రజా పరిషత్ నిధుల నుండి మంజూరు చేయడమైనదని తెలియజేశారు. 15వ తేది లోపు పనిని పూర్తి చేసి ప్రారంభోత్సమునకు సిద్ధంగా ఉంచాలని సూచించడమైనది. ఈ కార్యక్రమంలో గూడూరు జెడ్‌పిటిసి సభ్యులు, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, జె. మోహన్ రావు గూడూరు డిఎల్‌డివో ఇ. వాణి, గూడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన బిజేపి నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 30 ప్రభాతవార్త : భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్ప వరపు వెంకయ్య నాయుడును స్వర్ణభారతి ట్రస్ట్‌లో శనివారం నాయుడుపేటకు చెందిన బిజేపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిచారు.అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును నాయుడుపేట బిజేపి నాయకుడు బోల్లకాయల విజయ భాస్కర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శాలువాలు కప్పి, పుష్ప గుచ్చం అందజేశారు.ఈకార్యక్రమంలో కొప్పోలు సుబ్రమణ్యం, ఆరూర్ సుధాకర్,రాయపాటి విద్యాధర్,వెంకీలు ఉన్నారు.

కాపులూరు సర్పంచ్‌గా ఎన్నికైన సుబ్రమణ్యం

నాయుడుపేట,ఆగస్టు 30 ప్రభాతవార్త :మండలంలోని కాపులూరు గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా సంగీతం సుబ్రమణ్యం శనివారం ఎన్నికైయ్యారు. కాపులూరు సర్పంచ్‌గా పనిచేస్తున్న బూదూరు భూదేవమ్మ ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాదపడుతూ మృతిచెందారు. దీంతో ఉన్నతధికారుల ఆదేశాల మెరకు ఆపంచాయితీ కార్యదర్శి గోవిందయ్య వార్డుసభ్యుల సహకారంతో ఉపసర్పంచ్‌గా ఉన్న సంగీతం సుబ్రమణ్యంను సర్పంచ్‌గా ఎన్నిక చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు,అధికారులు సర్పంచ్‌గా ఎన్నికైన సంగీతం సుబ్రమణ్యం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో తెదేపా నాయకులు కాపులూరు చక్రపాణి, అప్పాడి సుబ్బారాయులు,రాజేష్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ నిధి ద్వారా రూ.5 లక్షలు అందజేసిన ఎమ్మెల్యే

గూడూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త: ఇటీవల ఆటోబోల్తా పడి ప్రమాదవ శాత్తు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన గూడూరు మండలం విందూరు గ్రామం పార్టీ కార్యకర్త చిల్లకూరు చెంచయ్య కుటుంబానికి పార్టీ సంక్షేమ నిధి (సభ్యత్వం ఉండి చనిపోయిన వారికి) మంజూరు అయిన రు.5లక్షలు రూపాయలను వారి కుటుంభ సభ్యులకు ఎమ్మెల్యే అందజేసారు.

చిట్టేడులో డిజె పట్టివేత

కోట, ఆగస్టు 30 ప్రభాతవార్త: మండలం చిట్టేడు గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకొని జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆ గ్రామస్థులు డిజె వినియోగించారు. శనివారం సమాచారం అందుకున్న ఎస్ఐ పవన్‌కుమార్ అక్కడికి వెళ్లి డిజెని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం గత కొద్దిరోజులుగా వినాయక చవితి ఉత్సవాలకు డిజెకు అనుమతి లేదని స్పష్టంగా ప్రకటించినప్పటికీ ఆ గ్రామస్థులు నిబంధనలకు విరుద్ధంగా వినియోగించారు.

గణనాధునికి వైభవంగా గ్రామోత్సవం

కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన మూషికవాహనసేవ సందర్భంగా ఉదయం సిద్ధిబుద్ధి సమేత గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం యాగశాలలో అర్చకులు యాగమూర్తికి శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. అలాగే అలకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓ రవీంద్రబాబులతో పాటు ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు పెద్ద పీట : ఎమ్మెల్యే

విజయపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు పెద్దపీట వేస్తున్నారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని మహారాజపురం గ్రామంలో శనివారం ఏర్పాటు చేశారు. సమావేశంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది కూటమి ప్రభుత్వమని అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దీపం పథకం ద్వారా మహిళలకి సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి అనుపమ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, సర్వేయర్ శేఖర్, వీఆర్‌వో చరణ్, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర కుమార్, బాలసుబ్ర హ్మణ్యం రాజు, కోసలనగరం సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో డైరెక్టర్లు వరదరాజులు, మురళి, మండల టీడీపీ నాయకులు దశరథరాజు, ముని భాస్కర్ రాజు, పురుషోత్తం, లోకేష్‌రాజు, సతీష్, సుధా నాయుడు, శివలింగం, శివయ్యనాయుడు, కొండూరు దాము, హరికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. శనివారం మూషిక వాహనసేవ సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో దేవస్థానం, ఉభయదారుల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ఉదయం నుండి రాత్రి వరకు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈమేరకు హరికథలు, కూచిపూడి, భరత నాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి.

కాణిపాకంలో నేడు(ఆదివారం)

పగలు: అభిషేకం, చిన్నశేష వాహనం- రాత్రి: బంగారు శేషవాహనం

ఉభయదారులు: కాణిపాకం, కాకర్లవారిపల్లి, పట్రాంపల్లి, మిట్టఇండ్లు, కొత్తపల్లి, అడపగుండ్లపల్లి, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లి, తిరువణంపల్లి, చిగరపల్లి, ఆగరంపల్లి గ్రామాదుల కమ్మ వంశస్తులు.

సాంస్కృతిక కార్యక్రమాలు: స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు జి.పురుషోత్తంరెడ్డి(తేనెపల్లి), ఎ.పుష్ప(తిరుపతి). ఉదయం 12 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు: ఆర్.మునీశ్వరయ్య(చెర్లోపల్లి), మధ్యాహ్నం 1 నుండి 2 గంటల వరకు గాయత్రి(తిరుపతి) వార్లచే భక్తి రంజని కార్యక్రమం., మధ్యాహ్నం 2 నుండి 3 వరకు విజయవాడ గాయత్రి నృత్య నికేతన్ వారితో భరతనాట్యం, మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు ఎం.సుమతిభాగవతార్(తిరుపతి) వారిచే హరికథ, మధ్యాహ్నం 4 నుండి 5 వరకు కె.కవిత(చెన్నై) సాయంత్రం 5 నుండి 6 వరకు సూర్యప్రసాద్(అనంతపురం), సాయంత్రం 6 నుండి రాత్రి 7 వరకు జాతీయ సాంస్కృతిక పరిశోధన మరియు దక్షిణ ప్రాంత కేంద్రం, రాత్రి 7 నుండి 8 వరకు గాయత్రి, వసంత్(తిరుపతి), రాత్రి 8 నుండి 9 వరకు వి.బాలాజీకుమార్, సత్యకీర్తి(హైదరాబాద్), రాత్రి 8 నుండి 10 వరకు: ఆర్.శ్రీనివాసరావు (విజయవాడ) వారిచే భరతనాట్యం, కూచిపూడి నాట్య కార్యక్రమాలు.

గణపయ్యకు దుర్గగుడి తరపున పట్టువస్త్రసాల సమర్పణ

కాణిపాకం, ఆగస్టు 30 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సిద్ధి, బుద్ధి సమేత స్వామి,అమ్మవార్లకు విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గమ్మ దేవస్థానం తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రముఖ ఆలయాల నుండి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించడం గత కొన్నేళ్ళుగా ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు ఇంద్రకీలాద్రి శ్రీదుర్గమ్మ దేవస్థానం ఈఓ శీనానాయక్, ప్రధాన అర్చకులు దుర్గా ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు శనివారం ఉదయం కాణిపాకం ఆలయం చేరుకుని స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి పట్టువస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామివారి ఎదుట వుంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఈఓ, అర్చకులకు స్వామివారి దర్శనానంతరం స్వామివారి శేషవస్త్రాలను, చిత్రపటాలను,ప్రసాదాలను అందజేశారు. ఇదిలా వుండగా దుర్గమ్మ దేవస్థానం తరపున కాణిపాకం ఈఓ పెంచల కిషోర్ దంపతులను, ఆలయ అధికారులను సత్కరించారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, ధనపాల్, ధనుంజయ, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు, దుర్గగుడి దేవస్థానం అధికారులు, సిబ్బంది, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 30 ప్రభాతవార్త: తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, నగర పాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు చెత్త తరలించే వాహనాల్లో మైకుల ద్వారా అవగాహన కల్పించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులకు సూచించారు. శనివారం నగరంలోని 30,31 వార్డుల్లో పరదాల వీధి, రామచంద్ర పుష్కరిణీ, జ్యోతి థియేటర్ కూడలి, నెహ్రూ నగర్, కావమ్ గుడి వీధి, ఐ ఎస్ మహల్, ఉర్దూ స్కూల్ వీధి, బ్రహ్మంగారి గుడి తదితర ప్రాంతాల్లో ప